

# అగ్రహారం కథలు

## వేదుల సుభద్ర



పేరులో ఒక రకమయిన రాజసాన్నీ, కొంత గాంభీర్యాన్నీ సంతరించుకుని ఆంధ్రదేశమంతటా ఉన్న చిన్న చిన్న గ్రామాలే అగ్రహారాలు. ఎదురెదురుగా చిన్నదీ, పెద్దదీ రెండు రాములవారి గుళ్ళూ, ఆ ఊరి దేవుడి కాళ్ళు నిత్యమూ కడుగుతూ అప్పుడప్పుడు వొద్దికగానూ, మరోప్పుడు కాస్త ఉగ్రంగానూ ప్రవహించే కౌశికగా పిలవబడే గోదావరి, వెనకే పచ్చదనాల నెచ్చెలులు వరిచేలూ, వాటికి కాపలాగా నిలుచున్న అన్నదమ్ముల్లాంటి కొబ్బరి చెట్లూ, ఇలా ఎంతో మనోహరంగా ఉన్న చోట ఎదురెదుగా రోడ్డుకిరువైపులా ఉన్న ఓ పాతిక ఇళ్ళని కలిపి ఒక ఊరుగా కట్టేస్తే అదే ఈ అగ్రహారం. అమ్మమ్మగారి ఊరు కావడమే కాకుండా, మరుగున పడుతున్న ఆచార వ్యవహారాలనీ, సంప్రదాయాలనీ, అనుబంధాలని మాకు రుచి చూపించింది కూడ అగ్రహారమే. చిలిపితనాల చిన్నతనాలూ, కలల అలల కౌమారాలూ, జీవితాన స్థిరపడే ప్రయత్నంలో ఉద్యోగాలూ, సద్యోగాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఇలా రకరకాల మెట్లు ఎక్కుతూ దిగుతూ మధ్యలో ఎక్కడో, ఎప్పుడో తెలియకుండానే పారేసుకున్న అమ్మ పెట్టిన కమ్మనైన తాయిలం లాంటి ఆ ఊరి జ్ఞాపకాలు ఇవి. మన ఇంట్లోనో, పక్కనో కనిపించి పలకరించే వ్యక్తుల్లాంటివే ఈ కథల్లో పాత్రలు. కొన్ని జరిగినవి, కొన్ని నే విన్నవీ , వీటికి కొద్దిగా నా సొంత కవిత్వాల రంగులూ, వర్ణనలూ, ఊహలు అద్దేసి ఆ చేనే(రా)తల కలనేతకి నేను పెట్టుకున్న పేరు అగ్రహారపు కథలు. - *రచయిత్రి(బెంగుళూరు)*

# చిన్నారి(టింగరి) బుచ్చి

" అబ్బబ్బా..వదినా ఈ పిల్లతో ఎలా వేగాలో నాకు తెలీడం లేదు. ఇంక ఈ జన్మకి నాకర్థం కాదు.. " ఆయాసమూ, ఆవేశమూ కలిసి రాగా అంది సూరమ్మ.

" పోనీలే సూరీ!.. ఏదో చిన్నపిల్ల.. నాలుగు రోజులు పోతే అదే తెలుసుకుంటుంది, అయినా ఇప్పుడేమయింది? " అంది శారదమ్మ అనునయంగా.

"ఇంకా ఏమవ్వాలి? మేము మీ ఇంటికి వచ్చేదారిలో గోపాలం మావయ్యగారు అరుగు మీద కూర్చుని జపం చేస్తున్నారా? అంతటి ఆయన్ని చూసి 'పేరు గోపాలం.. మనిషి మాత్రం కోపాలం..' అంది ఊరంతా వినేట్టుగా.. దీనితో నాకూ రోజూ చచ్చే చావుగా ఉందనుకో. నోరు మూసి, రెక్క పట్టుకుని లాక్కుని గబగబా వచ్చాను" అంది విసుగ్గా.

టవున్ నుంచి పిల్లలొస్తున్నారు, నాలుగు రకాల పిండివంటలు చెయ్యాలి, కాస్త సాయం రమ్మంటే వచ్చింది సూరమ్మ శారదమ్మ ఇంటికి.

వాళ్ళిద్దరూ అప్పటివరకూ మాట్లాడుకున్నదీ, కుంటున్నదీ సూరమ్మ వెనకాలే ఎర్ర జాకెట్టూ, పచ్చటి పొట్టి పరికిణీవేసుకుని నోట్లో బొటనవేలు వేసుకుని వచ్చిన తొమ్మిదేళ్ళ చిన్న పిల్ల 'చిన్నారి బుచ్చి ' గురించి.

ముగ్గురు ఆడపిల్లలూ, ఇద్దరు మొగపిల్లలతర్వాత పుట్టింది, అందరికంటే చిన్నదని సూరమ్మ 'చిన్నారి' అని పిలుస్తుంది. సూరమ్మ భర్త వెంకటేశం మాత్రం బుచ్చీ అని పిలుస్తాడు, తన తల్లి బుచ్చమ్మగారి పేరు పెట్టుకోవాలని అతని ఉద్దేశ్యం. అలా అలా అది

'చిన్నారి బుచ్చి' అయిపోయింది. అదే పేరు కాల్రకమంలో ఆ పిల్ల మాటలకీ, చేష్టలకీ, కనపరిచే టింగరితనానికి ' టింగరి బుచ్చి'గా స్థిరపడింది.

అతని తల్లి బుచ్చమ్మ గారికి అందుకే ఈ పిల్లంటే పంచప్రాణాలు. 'ఒరే వెంకూ.. ఇది నా బంగారు తల్లి. దీన్నేమీ అనకు.. నా తర్వాత నామూడువరసల పలకసర్లు దీనికే ' అనేది.

తెలివైనది కాదా? అంటే అవునని చెప్పలేం. అతి తెలివీ, ఆరిందాతనమూ అప్పుడప్పుడు. అలవి మాలిన అమాయకత్వం మరొకసారి. అతి వాగుడు ఒకప్పుడు, ముచ్చటైన మాటకారితనం మరొకప్పుడు. ఇల్లుపీకి పందిరేసేంత అల్లరి ఒకప్పుడు, ఇంట్లో మనిషి ఉందా లేదా అనే పొందిక మరొకప్పుడు.. అప్పుడప్పుడు పెద్ద వేదాంతిలా మాట్లాడేది.. మరొకప్పుడు అసలు తెలివీ, తేటా లేని దానిలా. మొత్తమ్మీద  చాలా విచిత్రమైన పిల్ల.

బుచ్చికి నాలుగో ఏడున్నప్పుడు కాబోలు.. బళ్ళో వేసారు. బడికి బానే వెళ్ళేది.. కానీ రోజూ ఎవరో ఒకరితో ఎదో ఒక గొడవ పడటం, దానితో పంతులుగారితో తిట్లు తినడం నిత్యకృత్యం అయిపోయింది 'అక్షరాలు తనే దిద్ది పెడతాను, తాయిలంవారు తెచుకున్న తాయిలం పెడితే, లేదా సగం వాడుకున్న పెన్సిల్ ఇస్తే 'అని అందరికీ చెప్పేది. వాళ్ళ దగ్గరనించీ సగం అరిగిపోయిన పెన్సిళ్ళు, లాక్కుని దాచేది, లేదా వాళ్ళిచ్చిన కొబ్బరి ఉండలూ, తేగబద్దలూ, నారింజకాయలూ ఇంటికి తెచ్చేది.

ఒకసారి అది చూసిన సూరమ్మ కోప్పడితే.. "వాళ్ళని దిద్దుకోవద్దన్నానా? కావాలంటే దిద్దిపెడతాను అన్నాను. వాళ్ళకిష్టమైంది ఇచ్చారు.. ఊరికే ఎవరైనా ఎందుకు చేస్తారు? "అని వాదించేది.

పైగా " కొత్త  పెన్సిల్ పది పైసలు.. ఇవి మన కొట్లో పెట్టి పది పైసలకి మూడు చొప్పున అమ్మితే చూసుకో ఎలా కొనుక్కుంటారో? "అనేది.

అంతేకాదు,  దారిలో కనిపించిన ప్రతీ ఇంట్లోకీ వెళ్ళడం, వారిని ఎదో ఒకటి మాట్లాడించి,  వాళ్ళింట్లోంచి ఓ నిమ్మకాయో, కరివేపాకో పట్టుకొచ్చేది.  ఇవన్నీ జరిగేసరికి దాదాపు ఒక గంట పట్టేది. దీనితో అక్క విసుక్కుంటే.. " నాకు ఇల్లు తెలుసు.. పెద్ద నువ్వేం తీసుకురావక్కరలేదు. నీ దారిన నువ్వు పో"  అంది.

"అమ్మా, దీనికి పెద్దా, చిన్న లేదు. ఎవరంటే వారినే పేరు పెట్టి పెద్ద ఆరిందాలా కబుర్లు చెప్తుంది. స్కూల్ నించి తిన్నగా ఇంటికి రాకుండా "అని చెప్పిందా పిల్ల అమ్మతో.

దానికి బుచ్చి ఊరుకోకుండా, "నలుగురితో కలిసి ఉండాలి అని మనం అనుకుంటే మనం నలుగురితో కలిసి మెలిసి ఉండాలి.. అంతేకాని 'ఇల్లో నారాయణమ్మ' లా ఒక మూల కూర్చుని ఉంటేమనల్ని పిలిచి పీట వెయ్యడానికి మనమేమీ మైసూరు మహారాణీలం కాదు,  అయినా ఇది నాఇష్టం" అనేది.

"ఎందుకే దాన్ని వాగిస్తావ్? ఏదో ఏడవనీ," అనేది సూరమ్మ ప్రాణం విసిగి.

వెంకటేశం తన అరుగుమీద చిన్న కిరాణా కొట్టు నడిపేవాడు. అమలాపురం బట్టలకొట్లో పని చేసేవాడు. అతను లేనప్పుడు సూరమ్మో, లేకపోతే పెద్దపిల్లలలో ఎవరో ఒకరో కొట్లో కూర్చునేవారు. పెద్ద ఆడపిల్లలిద్దరికీ పెళ్ళిళ్ళయి వెళ్ళారు. మూడోది కుమారీ, ఇద్దరు అన్నయ్యలూ ఎవరికి వీలుంటే వాళ్ళు చూసుకునేవారు కొట్టుని. ఇంటి అద్దె పోనూ, కొద్దిగా మిగిలేది వారికి. అదీ, బట్టలకొట్లో వచ్చే జీతం ఆధారం. చాలా జాగ్రత్తగా కుటుంబాన్ని నడిపేది సూరమ్మ.

అతి కష్టం మీద ఒక ఆవుని  సాకేది సూరమ్మ.. 'ఇంట్లో పాడి ఉంటే లక్ష్మి ఉన్నట్టే' అని ఆవిడ విశ్వాసం. ఆ ఆవు కూడా పాపం తనకిష్టమైనప్పుడు పాలిచ్చేది. 'ఎందుకే తిండి దండగ? దీన్ని అమ్మి పారేద్దాం' అని వెంకటేశం అంటే ఆవిడ ఒప్పుకునేది కాదు. 'తెలకపిండీ, చిట్టూ పెడితే అదే ఇస్తుంది చూడండి' పాలు అనేది.

"సరే.. మనకే అంతంత మాత్రం అంటే దీనికి అవన్నీ ఎక్కడనించి తెచ్చేది ?" అనేవాడు.

తెల్లని మల్లెపూవులాంటి కల్మశంలేని మనసు సూరమ్మది. మనసులో ఏదీ ఉంచుకోలేదు.. మనసుకి తోచినది మాట్లాడేయడమూ, తర్వాత అది మర్చిపోవడమూ ఆవిడ అలవాటు. ఎవరేమన్నా పెద్దగా పట్టించుకోదు.

బుచ్చి వాగుడు చూసి అప్పుడప్పుడు వెంకటేశం 'దీనికన్నీ నీపోలికలేనే' అని ఏడిపించేవాడు కూడా. అందుకే హాయిగా కడుపునిండా తింటుంది, కంటి నిండా నిద్ర పోతుంది. 'అంతకంటే అదృష్టం మరొకటుందా?' అంటుంది కూడా? 'నాకున్న నాలుగు చీరలూ చాలు, నాలుగు వేళ్ళూ నోట్లోకి వెళితే చాలు' అంటుంది నవ్వుతూ. ఊర్లో ఎవరికే సహాయం కావాలన్నా ముందుంటుంది. దానికి కృతజ్ఞతగా వారో పండో, పిండివంటో, ఊరగాయో ఇస్తే మొహమాటపడుతూనే పుచ్చుకుంటుంది. 'వాళ్ళ అభిమానం.. ఎలా కాదనను?' అంటుంది.

"ఏంవండావు సూరమ్మొదినా? " శారదమ్మ అడిగింది.

" మీలాంటి వారికైతే నాలుగురకాలు ఉంటాయి,, మాకేం ఉంటాయి? చెప్పు. పెరట్లోవే నాలుగు కాడలు పీకి, ఆవపెట్టి తోటకూర పులుసు వేసి ముద్దపప్పు వండాను. నిన్న మీ అన్నయ్య చవగ్గా ఉన్నాయని రెండు వీశెలు వంకాయలు తెచ్చారు. అవీ, క్రావారింటి పేరంటపు శనగలూ కలిపి ముద్దకూరా.. ఏదో ఉప్పూ, కారం సమానంగా పడితే పిల్లలు నాలిక్కి రుచిగా తింటారని. అంది ఆవిడ. " అంతేలే.. ఎన్ని ఒండావని కాదు.. ఎంత రుచిగా ఉన్నాయా? అని ముఖ్యం కదా.. నీ చేత్తో ఏది వండినా అమృతమే కదూ.. మా పెద్దాడెప్పుడూ అంటాడు. సూరమ్మత్త చేతి పులిహారా, బొబ్బట్ల రుచి మరెవరికీ రాదు " అని.

" మా అమ్మేమో, శారదమ్మత్త ఇంటి ఆవకాయ బ్రహ్మాండంగా ఉంటుంది.ఇవ్వాళ పని అయ్యాకా ఓ చిన్న జాడీడిస్తే బావుండును, సగం మీ చిన్నక్కకి ఇవ్వచ్చు" అంది వచ్చిన తర్వాత నోట్లో వేలు తీసి మొదటిసారి బుచ్చి మాట్లాడిన మాట.

సూరమ్మకి మొఖం ఎక్కడ పెట్టుకోవాలో తెలియలేదు. " నీ మొహం. వెర్రిపీనుగా!.. ఏదో సరదాకి అన్నాను" అంది.

" అదేమిటీ.. మనలో మనకి .. తప్పేముంది? దానికింత మొహమాట పడాలా? " అంది శారదమ్మ.

"అబ్బే చిన్నది విశేషమంటేనూ" అని నీళ్ళు నమిలింది సూరమ్మ బుచ్చిని మింగేసేలా చూస్తూ..

"చూసావా వదినా, ఇదీ వరస..! మూగివాడిముందు ముక్కు గోక్కోవడం మహాపాపమన్నట్టు అయింది దీనితో నాకు. నేనేదో మాటవరసకి అంటే.. ఇప్పుడంటే నువ్వే కనక పరవాలేదనుకో" అంది..

అప్పటికే శారదమ్మ చిన్న జాడీ నిండా ఆవకాయ సర్దేసింది, మరేంపరవాలేదు అంటూ

ఎవరింటికైనా వెళ్ళినప్పుడు 'నాకో రెండు బాల్చీల నీళ్ళు తోడవే బుచ్చీ అంటే. "ఊరికే నాకు పని చెప్తావేం? ఇంత డబ్బుంది, ఓ మోటరు పెట్టుకుని ఇక్కడొక కుళాయి పెట్టుకోవచ్చుకదా. సుఖపడటం చేతకాదు.. నీకు. ఈసారి మీ ఆయనతో నేను చెప్పానని చెప్పు" అని సలహా ఇచ్చి మరి రెండు బకెట్లు తోడి ఇచ్చేది.

" మీ ఆయనేవిటే. మావయ్య అనలేవూ? "అనేది ఆవిడ.

" ఏదో ఒకటిలే. అవ్వపేరే ముసలమ్మ కాదూ " అని తుర్రుమనేది.

"పక్కింటివాళ్ళు కాశీ వెళుతున్నామని చెప్పినప్పుడు..

"పూర్వం అనేవారుట.. కాశీకి వెళ్ళినవాళ్ళూ, కాటికి వెళ్ళినవాళ్ళూ ఒకటే అని. జాగ్రత్తగా వెళ్ళి రండి." అని ఇంకా ఏదో అనబోతున్న బుచ్చి గొంతు నొక్కి లోపలకి తీసుకుపోయింది వాళ్ళ అక్క.

"అది కాదే. మీరు మళ్ళీ వెనక్కి సరిగ్గా వస్తారో రారో?, పోనీ మీరు మొన్న కొత్తగా కట్టిన గులాబీ అంటుని నేను తీసేసుకోనా? అని అడుగుదామనుకున్నాను. నువ్వు చెప్పా పెట్టకుండా లాక్కొచ్చేసావు అచ్చు అమ్మలా".. అని చిరుబురులాడింది. " దాన్ని చూస్తే

పాపం రోజూ నీళ్ళు పొయ్యాలని అనిపిస్తుంది ఊరికే వాళ్ళ మొక్కకెందుకూ నీళ్ళు పొయ్యడం? మనదైతే బావుంటుంది కదా అని, అందుకే".. అన్న చెల్లెలిని చూసి నెత్తి మీద కొట్టుకుంది కుమారి.

'అన్నయ్యలు ఈత కెళతారు కదా నేను వెళ్ళకపోవడమేం?' అని చెప్పా పెట్టాకుండా కౌశికకి వెళ్ళిపోయింది. పావంచాల మీద కాలు అనుకోకుండా జారి ప్రవాహంలో కొట్టుకుపోవడం మొదలుపెట్టింది. అప్పుడు అనుకోకుండా చూసిన పేరివారి అబ్బాయి చంటి గభాల్న నీటిలో దూకి ముందు బుచ్చి పరికిణీ, తర్వాత జడా పట్టుకుని ఈడ్చుకుని వచ్చాడు.

సూరమ్మ కోప్పడబోతే "వినాయక చవితికి కలువ పూలు తెద్దామని వెళ్ళాను, ఇంకాస్త ఆగితే అందేసుకునేదాన్ని, ఈ లోపులో ఏదో పెద్ద కొంప మునిగిపోయినట్లు చంటన్నయ్య లాక్కొచ్చేసాడు". అంది కోపంగా

"నీ మొహం! కలువపూలుట, కలువ పూలు.. పీక నొక్కుతాను ఇంకా మాట్లాడావంటే" అని సూరమ్మ వీరంగం వేసింది. బుచ్చిమీద. ఇలాంటి వ్యవహారాలు నడుపుతూనే బుచ్చి పదహారేళ్ళపిల్లయింది. వాగుడు కానీ, టింగరి తనం కానీ పిసరంత కూడా తగ్గలేదు.

"వానపామూ ఒక పామేనా? మేనత్త కొడుకూ మొగుడేనా ?అంది వదినా. శ్రావణమాసంలో వస్తామని మా ఆడపడుచు ఎంతో ప్రేమతో కబురు చేస్తే.. ఆవిడ మంచిది కనకా, దీని వాగుడూ, తన అన్నయ్య కుటుంబ పరిస్థితి తెలుసు కనకా పట్టించుకోలేదు. పిల్లాడు వింటే ఏమనుకుంటాడు చెప్పు? ఎవరు చెప్పాలి దీనికి? " అని శారదమ్మతో చెప్పి బాధపడింది సూరమ్మ.

" మా అత్తయ్య అలా అంటుంది. మా నానమ్మ మెళ్ళో గొలుసు అందరికంటే చిన్నదాన్ని నాకే ఇస్తుందని మా అత్తకి తెలుసు.. అందుకే నన్ను చేసుకుంటానంది, కనకా, మా నాన్నమ్మ నాకెప్పుడో చెప్పింది విషయం." అంది బుచ్చి ఫెళ్ళున.

"తప్పు బుచ్చీ, పెద్దవాళ్ళని అలా అనకూడదు.. అయినా మీ అత్తయ్య మీ నాన్నతో మొన్ననే చెప్పిందిట.. బుచ్చికి పెళ్ళి నగలన్నీ నేనే చేయిస్తాను. మీ నాన్నమ్మ గొలుసు మీ అక్కలు ముగ్గురికీ ఇవ్వమని. మీ నానమ్మ ఊరికే అలా చెప్పి ఉంటుంది" అని కేకలేసింది శారదమ్మ.

'పెళ్ళయితే ఒక దారిన పడుతుందిలే' అని అందరూ సూరమ్మకీ, వెంకటేశానికీ ధైర్యం చెప్పారు.

బుచ్చి ఆఖరి అత్త సత్యవాణి చాలా మంచిది. చిన్నప్పటినించీ ఈ అన్నయ్యన్నా వదినన్నా చాలా అభిమానం ఆవిడకి. అందుకే పాపం పిల్లలు కలవాడు అన్నయ్య. ఏదో తనకు తోచిన సహాయం చెయ్యాలని పాపం నిజంగానే ఆవిడ తాపత్రయం.

తమలపాకుల దగ్గరనించీ తెచ్చుకుని తాంబూలాల తతంగం జరిపించింది. మాఘమాసంలో ముహూర్తం నిర్ణయించారు.

"అన్నయ్యా, ఊరికే అదీ, ఇదీ అని హైరానా పడకు. అంతా ఒక కుటుంబంలో వాళ్ళం.మనలో మనకి వాళ్ళం.మనలో మనకి ఈ అనవసరపు మర్యాదలేమిటి చెప్పు? మీ బావే ఉంటే ఎంతో సంతోషించేవారు. ఇలా మన రెండు కుటుంబాలు ఒకటవుతున్నందుకు. పెళ్ళి కాగానే మనందరమూ మా ఊరు అన్నవరం వెళ్ళిపోదాం. మీ అల్లుడు ఎలాగూ దేవస్థానంలోనే పనిచేస్తాడు కనక, స్వామి సన్నిధిలో సత్యనారాయణ వ్రతం చేయిద్దాం, అక్కడే మాకు తెలిసిన వారందరికీ భోజనాలకి చెప్పాను" అంది.

తనకన్నా చిన్నదైన చెల్లెలి పెద్దమనసుకు ఎంతో సంతోషించాడు వెంకటేశం.

అలా ఉన్నంతలో బాగానే జరిగింది పెళ్ళి. అయిన రెండు రోజులకి బుచ్చి అన్నవరం వెళ్ళిపోయింది. ఆ పిల్ల వెళ్ళిపోవడంతో ఊరంతా చిన్నపోయింది. నాలుగేళ్ళలో ఇద్దరు పిల్లలకి తల్లి అయింది బుచ్చి. జడ దగ్గరనించీ వేసేది ఆమె అత్తయ్య. భర్త వేణు కూడా ఎంతో ప్రేమగా చూసుకునేవాడు. 'అమాయకురాలు. బొత్తిగా లోకం తెలియని పిల్ల, దాని మాట చూడకండర్రా, మనసు చూడండి అని వెనకేసుకుని వచ్చేది' సత్యవాణి బుచ్చిని.

" నువ్వు ఇలా అన్నీ చేసి నోటికందిస్తూ ఉంటే దానికెప్పుడమ్మా బాధ్యతా, బరువు తెలిసేది? " అని సూరమ్మ ఆడపడుచుని సాధించేది.

" ఇదిగో వదినా, మా అత్తాకోడళ్ళకి లేనిది నీకెందుకు మధ్యలో చెప్పు. ఊరికే మా ఇద్దరి మధ్యా తంపులు పెడదామని చూస్తున్నావా ? " అని నవ్వుతూ ఎదురు అడిగేది.

" బావుందమ్మా, కందకి లేని దురద కత్తిపీటకెందుకనీ? "

' పిల్లకి సరి ఐన బుద్ధి ఇవ్వకపోయినా చక్కని ఇల్లిచ్చావు భగవంతుడా, దాన్ని నాలుగు కాలాలు చల్లగా చూడు' అని సూరమ్మ రోజూ దండాలు పెట్టేది.

బుచ్చి పెళ్ళి అయ్యి దాదాపు పదేళ్ళు కావస్తోంది. వాళ్ళ పాత ఇళ్ళు రిపేర్లు చేయించుకుని, పిల్లలకి మరొక గది వేసుకున్నారు. హాయిగా ఉన్నారు

ఒకరోజు కొండ మీద పని చూసుకుని మామూలుగానే కిందకి వస్తున్న వేణు రాత్రి అనుకోకుండా కురిసిన కుంభవృష్టిలో తడిసి ముద్దయి పోయాడు. దానితో మర్నాడే జ్వరం వచ్చి మంచం ఎక్కాడు. నాలుగు రోజులైనా ఎక్కడా దిగకపోవడంతో అత్తా ,కోడళ్ళు కంగారు పడి డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళారు. ఆయన ఇచ్చిన మందులూ ఏమీ గుణం చూపించలేదు సరికదా , రోజు రోజుకీ జ్వరం మరింత పెరిగింది. అది న్యుమోనియా లోకి దింపిందనీ, ఊపిరితిత్తులలోకి బాగా నీరు, నెమ్ము చేరిపోయింది, మనం చెయ్యగలిగినదంతా చేసాం, మిగతాది దేవుడిదే భారం అని డాక్టర్ చెప్పేసరికి సత్యవాణికి కాలూ చెయ్యీ ఆడలేదు. ఒక్కగానొక్క కొడుకునీ రక్షిస్తే మూడు సార్లు కొండమీదకి నడిచి వస్తానని మొక్కు కుంది, ఎందుకోగానీ సత్యనారాయణ స్వామి ఆవిడ మొరలు వినలేదు. పదిహేను రోజులు జ్వరంతోనూ, న్యుమోనియాతోనూ పోరాడి వేణు ఓడిపోయాడు.

రెండు కుటుంబాలూ దు:ఖసాగరంలో మునిగిపోయాయి. . ముఖ్యంగా సత్యవాణిని ఓదార్చడం చాలా కష్టంగా ఉంది. "అన్నీ ఇచ్చినట్టే ఇచ్చి ఇలా చేసావేమిటయ్యా భగవంతుడా" అని సూరమ్మ కన్నీరు మున్నీరయింది.

ఇద్దరు ఆడవాళ్ళు అక్కడ ఉండడం మంచిది కాదని వెంకటేశం వారిద్దరినీ అగ్రహారం వచ్చేయమని ఎంత బతిమాలినా వినలేదు వాళ్ళు. ముఖ్యంగా బుచ్చి.

" బావలేకపోయినా, ఇక్కడే తిరుగుతున్నట్టే ఉంది నాకూ అత్తయ్యకీ.. మేము ఇక్కడే ఉంటాము పిల్లలతో పాటు" అంది.

కొన్నాళ్ళకి దేవస్థానం వారు వేణు చేసే ఉద్యోగానికి బదులు బుచ్చికి వచ్చిన పని ఇవ్వగలమని, వేణు మంచితనానికి పని మీద అతనికున్న శ్రద్ధకీ తాము చెయ్యగల సహాయం ఇది మాత్రమేనని చెప్పారు. తండ్రిని తీసుకుని వెళ్ళింది బుచ్చి. ప్రసాదం సెక్షన్‌లో పని చెయ్యడానికి ఆమెని తీసుకున్నారు.

కొడుకు పోయిన దుఖంలో కుమిలిపోతున్న అత్త దగ్గరికి వెళ్ళి.. "అత్తా, బావ లేని లోటు మనిద్దరికీ తీరేది కాదు, పొద్దు పొడిస్తే ప్రతీ పనిలోనూ, ప్రతీ క్షణంలోనూ గుర్తుకు వస్తూనే ఉంటాడు కదా, అలా అని పోయినవాళ్ళతో మనమూ పోలేము కదా.. పోవడానికి ఒక రోజు ముందు నాతో ఏమన్నాడో తెలుసా?

'చిన్నారీ, నేను లేకపోతే నీకు ముగ్గురు పిల్లలు.. ఇన్నాళ్ళూ నువ్వూ పిల్లలతో సమానంగా ఉండేదానివి.. ఇప్పుడు నువ్వే బాధ్యత నేర్చుకోవాలి, ఇంకా చిన్నపిల్లలా ఉండకూడదు, నిన్నెవరూ ఈ పైన టింగరి బుచ్చి అని పిలవకూడదు... అమ్మని, పిల్లలని చూసుకోవాలి. నేను లేని లోటు తెలియకుండా..' అన్నాడు.

ఆ మాట నిలబెడతానని నేను బావకి మాట ఇచ్చాను. అందుకని ఈ రోజునించీ నువ్వే ఈ ఇంటికి పెద్ద పిల్లవి.. అందుకని నా మాట వినాలి బుద్దిమంతురాలిలాగా "అంది తన కళ్ళల్లోని నీళ్ళు ఆవిడ కళ్ళల్లో పడకుండా దాచుకుంటూ.

పక్కగదిలోంచి ఈ మాటలు విన్న సూరమ్మ, వెంకటేశం ఆశ్చర్యపోయారు. ఆ మాటలంటున్నది మన బుచ్చేనా? అని. మరుసటి నెలలోనే ఉద్యోగంలో చేరింది బుచ్చి. ఎంతో శ్రద్ధగా పని చేసేది.

పొద్దున్నే వంట చేసి, పిల్లలకి కారీలు కట్టి, తనూ డబ్బా సర్దుకుని, అత్తగారికి చెప్పి బయలుదేరేది. సాయంత్రం పిల్లలు హోంవర్క్ చేసుకుంటూ ఉంటే తనూ, అత్తగారు కలిసి వంటపనీ, ఇంటిపనీ చేసుకునేవారు. ఒక్కర్తే ఉంటుందని అత్తకి పొద్దుపోవడం కోసం వాయిదాల పద్ధతి మీద టీ.వీ కొంది.

పిల్లల బట్టలూ, తనవీ అత్తవీ జాకెట్లు కుట్టడమూ నేర్చుకుంది.

మేనమామ సహాయంతో తెలిసిన వారి దగ్గర అప్పు తీసుకుని చిన్న మోపెడ్ కొనుక్కుంది. పక్కవారి పిల్ల అనసూయ దగ్గర దానిని ఎలా నడపాలో నేర్చుకుని రోజూ పిల్లలని దానిమీద దింపి అక్కడనించి ఆఫీస్ కెళ్ళేది.

ఇలా ఏడాది దాటేసరికి బుచ్చి అత్త సత్యవాణికి కూతురూ, కొడుకూ, కోడలూ అన్నీ తానే అయింది. పిల్లలకి తల్లీ, తండ్రీనూ.

" బావ జ్వరంలో ఉన్నప్పుడు అనేవాడు. భగవంతుడు ప్రతీ వాడి నుదిటిన ఎన్ని తిండి గింజలు తినాలో రాసే ఉంచుతాడు చిన్నారీ.. అది మార్చడానికి మనం ఎవరం? అని.. మన చేతిలో ఏముంది? ఇలా అనుకుంటేనే కదా బ్రతకగలిగేది? లేకపోతే బావ లేకుండా ఇలా మేమందరమూ బ్రతకగలుగుతున్నామంటే మాకందరికీ దేవుడిచ్చిన కాసిని ఎక్కువ గింజలే కారణం కాదూ.. నువ్వు చెప్పు అత్తయ్యా "

అని తమని చూడటానికి వచ్చిన శారదమ్మతో అంటే ఏం మాట్లాడాలో తెలియనట్టుఉండిపోయింది.

అందరిచేతా అల్లరిది, వాగుడుకాయ, టింగరిది అనిపించుకున్న పిల్ల ఇదేనా? జీవితం మనిషికింత జ్ఞానాన్నిస్తుందా? లేక ఈ పిల్లని తామెవ్వరం సరిగ్గా అర్థం చేసుకోలేక అలా అనుకున్నామా? ఒక్కసారిగా ఎంతో పెద్దదయినట్టు కనిపిస్తున్న చిన్నారి కాని, టింగరికాని బుచ్చిని కొత్త మనిషిని చూసినట్టు చూసింది.

Click here to share your comments on this article